# ఐశ్వర్యం

శ్రీ దేశిరాజు వెంకటరమణరావు

ఇప్పుడు మూడంతస్తుల మేడవుండే, ఆచోట బ్రహ్మాండమైన ఓ ముళ్ళతోపుండేది. రాళ్లతో రప్పల్తో నిండి, చీకటిపడ్డాక ఎంతవాడికైనా హడల్ కొట్టించేది. కర్మవశాత్తూ, రాత్రి ఆ తోవమ్మట వచ్చి పోయేవారు, అక్కడ పాములే వున్నయో, దయ్యాలేవున్నయో, దొంగలేవున్నారో అని దిగులు పడిపోయేవారు. ఆ స్థలం నాదన్నవాడు లేడు. ఎవరిదైతే ఎవరిక్కావాలి? ఏం చేసుకోవాలి? క్షణం నిల్చుండలేరుగా! భయంకర ప్రదేశం!! కానుకతో ఇస్తామన్నా ఎవరూ పుచ్చుగోరు.

యుద్ధం ముమ్మరంగా సాగుతున్న రోజులవి. పల్లెటూర్లో జీవనోపాధికి తాత తండ్రులు గడించిన ఆస్తిపాస్తులు, మడీమట్రా లేక సీరపాణి పట్నం చేరుకున్నాడు. ముళ్లతోపు స్థలంలో ఒకపాక నిర్మించుకొన్నాడు. చేతనున్న ధనంకాస్తా వెచ్చించి అందులో ఒహ చిన్న తేనీటి దుకాణం ప్రారంభించాడు.

మొదట్లో అమ్మకం అంత సంతృప్తికరంగా వుండేది కాదు. రోజంతా శ్రమిస్తే రెండు రూపాయలుండేదేమో. పెద్ద కుటుంబం. చాలక ఇంటిల్లపాదీ కటకటలాడిపోయేవారు. 'కష్టకాలంలో అంతమందిని ఎట్లా పెంచగలనా?' అని దుఃఖిస్తుండేవాడు సీరపాణి.

ముళ్లతోపుస్థలంలో, పాక నిర్మించుకున్న వ్యక్తిని గూర్చి పలువురు పలువిధాలా అభిప్రాయపడేవారు. కొందరు వాడి గుండె నిబ్బరంగూర్చి ప్రస్తావించేవారు. కొందరు వాణ్ణి వెర్రివెధవక్రింద జమకట్టేవారు. 'వెర్రి వెధవ కాకపోతే, నిర్మానుష్యమైన చోట నివాసం ఏర్పరుచుకుంటాడా?' అనుకొనేవారు.

పిల్లలు చీకట్లో అక్కడ వెలుగుతుండే దీపాన్ని దూరం నుండి చూసి, దయ్యాలు మంటలు వేసుకుంటున్నాయనీ, నిప్పుల యుద్ధం చేసుకుంటున్నాయనీ అనుకొనే వారు.

సీరపాణి తేనీటిని శుభ్రంగా తయారుచేసి అందిచ్చేవాడు. తగినన్ని పాలూ, తగినంత చక్కెరా, తగినంత తేయాకూ, అందులోని సుగుణాలు. రుచిమంతంగా వుండేది అతడు స్వహస్తాల్తో కలిపి ఇచ్చిన టీ. అతడు స్వయంగానే టీ కలిపి యిచ్చేవాడు. 'చేస్తున్న సాడేముప్పాతిక వర్తకానికి నౌకర్లు కూడానా?' అని అతని జవాబు.

కర్మాగారాలనుండి కష్టించి వచ్చే పాటకజనానికి సీరపాణి టీ, తీరని ఆహ్లాదం కలిగించేది. కప్పు టీ తాగి, పగటి పరిశ్రమ అంతా మరిచిపోయి, హాయిగా, ఖులాసాగా, పాటలు పాడుకుంటూ ఇళ్లకు చేరుకునేవారు కూలీలు. రాను రాను కూలీలందరికీ సీరపాణి టీ దుకాణం మన్మథబాణమయిపోయింది. ఇంటివద్దనున్నప్పుడూ, యంత్రాలయాల్లో పనిచేస్తుప్పుడూ, వారికి సీరపాణిటీ వైపే మితిమీరిన మతి. 'ఎప్పుడు పోయి ఓ కప్పు వేడి టీ తాగివస్తామా?' అని ఉవ్విళ్లూరుతుండేవారు.

సీరపాణి టీ ఖ్యాతి ఒక్క యంత్రాగారాల్లోకే కాదు; పెద్దపెద్ద ఉద్యోగుల్లోకి, గుమాస్తాల్లోకి, సైతం పాకిపోయింది. తామూ తాగదల్చేవారు. కానవుతే, అదో తాటాకులపాక. అందులో కుర్చీ లుండవు. బెంచీ లుండవు. సూట్లతో బూట్లతో ఎలాపోయి టీ తాగగలమని జంకిపోయేవారు. వారి అఖండ అనుమానం సమాను లెవరన్నా చూసి నవ్వుతారేమోనని! అందుకు విరుగుడుగా తలోకప్పు టీ—బంట్రోతులచేత తెప్పించుకుని చాటుచాటున చప్పరించేవారు. ఎవరన్నా ఎక్కడిదని అడిగితే, 'ఇంటివద్దదేనండీ!' అని కమ్ముకునేవారు తమ చర్యని.

సీరపాణి ఎంత చకచకా టీ తయారుచేయగలిగినా, తండోపతండాలుగా వచ్చిపడుతున్న జనసమూహానికి వెంటనే టీ అందించలేకపోయేవాడు. అందించలేకపోతే వ్యవహారం చేసుతుంది. వ్యాపారం సన్నగిల్లుతుంది. మలమలా మాడవలసివస్తుంది. పిల్లాపిచ్చికతో వున్నాడాయె. చేసేదేమీలేక, ఒకరిద్దరు నౌకర్లనిద్దరి ఇరవైరూపాయల జీతంపై నియమించుకున్నాడు.

రాబడి ముందుకి సాగిపోయింది. రోజుకి ఎట్లా చూసినా, ఏభయిరూపాయిల టీ చెలామణీ జరిగేది. ఖర్చులుపోను అధమం దినానికి పాతికరూపాయిలు నిష్కర్షగా మిగిలితీరేవి. అంటే—నెలకి దాదాపు ఏడెనిమిదివందలు! పీనుగులాంటి సీరపాణి ఏనుగులా అవుతున్నాడు ఐశ్వర్యబలమెక్కి.

వ్యాపారం పెంచదలిచాడు దుకాణాన్ని ఆకర్షణీయం చేయదలిచాడు. ఆర్జించిన మూడు నాలుగు వేల రూపాయిల్నీ వెచ్చించి, సుందరమయిన భవనం ఒకటి నిర్మింపజేశాడు. కుర్చీలూ, బల్లలూ, నిలువుటద్దాలూ ఒకటేమిటి! అన్నీ సమకూర్చుకున్నాడు. 'టీ దుకాణం' అన్న సిరారాతి అట్టముక్కను పెరికింపించి, దాని స్థానే 'నీలగిరి ఫలహార నిలయం' అన్న బోర్డుని శిల్పిచేత రాయించి, తగిలింపించాడు. భవనం సర్వం విద్యుత్కిరణాలమయం. పంకాలు గిర్రున తిరుగుతున్నాయ్. కళ్లు జిగేల్మంటున్నవి చూసేవారికి.

ఇంతకుమునుపు దుకాణానికి వచ్చి కూచోవడం దర్జా తక్కువగా పరిగణించిన ఘరానా మనుషులందరూ ఇప్పుడిప్పుడు బాహాటంగావచ్చి చేరుతున్నారు. శ్రామికులు—సరేసరి! ఎప్పుడూ వస్తూనే వున్నారు. ప్రతి గడియా అదొక వుత్సవం! అదొక తీర్థం! అదొక మహాక్షేత్రం!! అతిథుల వినోదం కోసం విశ్వశ్రవణయంత్రంకూడా కొనిపెట్టాడు సీరపాణి.

పాకశాలలో పదిమంది నిపుణులు పని చేస్తున్నారు. ఫలహారాలందివ్వడానికి అంతకు రెండు రెట్లమంది నౌకర్లు. సీరపాణి గొక్కం అందుకుంటూ అప్పుడప్పుడు వారి, వారి పనిపాట్లని తనిఖీ చేసి వస్తూవుండేవాడు.

క్లబ్బు కల్పవృక్షమయింది. కనకాన్ని వర్షిస్తోంది.

సీరపాణి దృష్టి ఇతర వ్యాపారాలమీదికి మళ్లింది. మరికొన్ని తరహాల వ్యవహారంకూడా చేస్తే ఎందులో నష్టం వచ్చినా, ఇంకొకవిధంగా సర్దుకోవచ్చునని అతని వూహ.

జనపనారలో మహిమ వుంది. దయదలిస్తే అది ఎంత మీదికయినా ఎత్తేసి, కుబేరుడంతవాణ్ణి చేసి పారేస్తుంది. లేదా, అథః పాతాళాల్లోకి అణిచిపెట్టి పూర్తిగా సన్యాసినిచేసి పారేస్తుంది. జనపనార సంగతి అట్టిది. సీరపాణిని అది ఎన్నడూ మోసం చెయ్యలేదు. అతనికో కారూ, కొన్ని వేల ధనమూ బహూకరించింది.

పెద్ద షావుకారొకాడు దివాలా తీశాడు. దివాలా కాదని కొందరి వాదన. అప్పులెగేసేందుకు పన్నిన పన్నాగం అంటారు పలువురు. ఆస్తులన్నీ భార్యపేర పదిలపరిచినమీదటే 'దివాలా! దివాలా!' అని కేకవేశాట్ట. జాగ్రత్తలో కొద్ది మతి తప్పడంవల్ల అతని యంత్రాగారం ఒకటి వీధి బడింది. వేలంలో లంకించుకున్నాడు సీరపాణి. ఏభయివేల విలువ గలిగిన యంత్రాలయం సులభంగా పదివేలకి మాత్రమే సంపాదించగలిగాడు. చేతిలో యంత్రాలుండడం కారణంగా వర్తకాన్ని నూనెడబ్బాల్లోకి దించాడు.

ఇవన్నీ ఒకెత్తు: చీకటిబజారువ్యాపారం ఒకెత్తు. చీకటి వ్యాపారంచేస్తే రెట్టుకి మూడురెట్ల లాభం. ఆ కిటుకుకూడా గ్రహించాడు సీరపాణి. ప్రభుత్వ అజమాయిషీలో వున్న, బజార్లో దుర్లభమయిన వస్తువులన్నిటినీ చాటుగా పోగుజేసి నిలవచేసి, రహస్యంగా అమ్మించేవాడు. వస్తువు దొరక్క తహతహపడుతున్న ప్రజాసమూహం ఎంత ఖరీదన్నా ఇచ్చి కొనుక్కునేది.

బ్యాంకు నిల్వలు తాటిచువ్వల్లా మీదికి పాడిచాయ్. వెయ్యడమేగాని, తియ్యడం తెలియదు సీరపాణి అలివేణికి—

ఊర్లో నాలుగు మిల్లులు, పది రేషనుకొట్లు, ఒక వెండి బంగారు నగలదుకాణం; అన్నిటికన్నా అతి ముఖ్యమైనవి ఏడెనిమిది ఫలహారశాలలు అతనికున్నవంటారు. అందులో ప్రతీదీ రాబడి కాల్వే—

మ్యున్నిపాలిటీవద్దనుండి పలుకుబడినంతా వినియోగించి ముళ్లతో పుస్థలం నికరంగా అందుకున్నాడు. ఇప్పుడు కనిపిస్తోందే—ఆ మూడంతస్తుల మేడ! దాన్ని కట్టించుకున్నాడు.

టింగు రంగాలా బతుకుతున్నాడు ఏ కొదవా లేక.

*　　*　　*　　*

దుర్భరంగా వుంది జీవితం శివరామశర్మకి. ఎంతో చికాకు కలిగిస్తోవుంది. నెల ముప్పై రోజులూ, అహోరాత్రాలు—నిద్రాసుఖాలు మాని పనిచేస్తే నెలచివర కంపెనీవారు ఎనభైరూపాయల జీతం ముట్టజెబుతారు. పేరుకే ఎనభై! ఎనిమిది చిల్లిగవ్వలన్నా కాకుండా, ఎనిమిదో తేదీ ఉదయం ఎనిమిది గంటలకే మాయమయి వూరుకుంటాయ్! నెలలో చేసిన అప్పులికి సగం జమ. మిగిలింది ఇంటి బాడుగకీ, అంట్లదానికీ వగైరా, వగైరా. కొన్నిటికి చాలనే చాలదు. మళ్ళీ ఎప్పటికిమల్లే ఇక్కడా అక్కడా చేబదుళ్లు. పాము మింగేస్తూనే వుంటుం దెప్పటికప్పుడు.

పిల్లలు బట్టలు కుట్టించమంటారు. భార్య నగలూ, నాణాలూ తెమ్మంటుంది. నాన్న ఏమీ పంపించావు కావంటాడు. అక్కచెల్లెళ్లు అవీ, ఇవీ అడుగుతూనే వుంటారు. తల్లి తన అసమర్థతకి దూషిస్తూనే వుంటుంది. చుట్టాలూ, స్నేహితులూ శర్మ బాగోగులు పరీక్షించడానికి రాబందుల్లా వాలిపోతూ నేవుంటారు.

—వీ రందరికీ ఏం పెట్టను?

ఉదయం పదిగంటలకనగా హడావిడిగా మూడుముద్దలు మింగి. కచేరీకి పోతాడు. రాత్రి తొమ్మిది గంటలకి కాబోలు పనిపాట్లని ముగించుకు ఇంటికి చచ్చి చచ్చి చేరుతాడు. ఈలోగా ఆకలేస్తే క్లబ్బుకి పోయి, కాస్త ఫలహారంచేసి, కాసింత టీ తాగడానికి నెలకో పదిహేను రూపాయలన్నా అధమం వుండి తీరాలి.

—దయదలచి ఎవడిస్తాడీ సొమ్ము?

మితిమీరిన పరిశ్రమవల్ల తనకో తనవాళ్ళెవరికో జబ్బు చేస్తుంది. డాక్టరు ఖరీదైన మందులు ఎంచెంచి చెబుతాడు. గళాని కెముక లేకుండా ఫీజు తెమ్మంటాడు. జబ్బుతోవున్న రోగిని శ్మశానానికి పంపించడమా? డబ్బుకోసం వీరినీ, వారినీ పోయి యాచించడమా?

యాచనా కాలం గతించి చాల్నాళ్ళయింది. యాచకుల్ని కనికరించేవా రెవరూ లే రీ విశాల ప్రపంచంలో. కనిరికొట్టబోయేవారే అందరూ. యాచనవల్ల ప్రయోజనం సుతరామూ కనిపించదు.

వర్తమానం ఇంత విపరీతంగావుంటే, భవిష్యత్తు తల్చుకుంటే గుండె తడి అసలే ఆరిపోతున్నది.

"రేపు సాయంత్రం అయిదు గంటలనుండీ తమ ఉద్యోగం మా కక్ఖర్లేదు. దయచేయండి—శర్మగారూ!" అని కంపెనీవారు తాఖీదు బనాయిస్తే?...

రేపే అనగా రేపే కాదనుకోండి. ఏనాడన్నా కావచ్చు. పొమ్మనక తప్పదు. తనకీ వుద్యోగం శాశ్వతం ఎన్నటికీ కాదు. పొమ్మన్న వెంటనే ప్రత్యుత్తర రహితంగా కుర్చీని కాళీచేసి బయటికి నిష్క్రమించవలసిందే.

ఉద్యోగఉద్వాసన అయినవెనక శివరామశర్మకి గత్యంతర మేమిటి?—భార్యా, పిల్లల్ని ఎలా పోషించగలుగుతాడు? ఏ నూతిలో పడి అకస్మాత్తుగా ప్రాణాలు విడవగల్డు!

చా. ఛా. ఈ వుద్యోగం వుండి ఏం సుఖం? లేకేం సుఖం?

శ్రమ దండగే. పొట్టకే చాల దీ సంపాదన. ఇంకో పని చేసేందుకు వీలివ్వవు నియమ నిబంధన్లు. పారతంత్ర్యం! అంతా పారతంత్ర్యం! లేని భయం నటించాలి. భయం చూపించాలి. ఒకదినం విశ్రాంతికి శెలవుచీటీ పంపించాలి. లేదు పొమ్మంటే, మారు మాటాడకుండా కుక్కిన పేనులా కచేరీకి హాజరయి కాయాన్ని కష్టపెట్టితీరాలి.

శివరామశర్మ దీర్ఘంగా ఆలోచించాడు. నెత్తి పగులగొట్టుకున్నాడు.

స్మృతిపథంలో సీరపాణి చిర్నవ్వుతో ప్రత్యక్షమయాడు. అతడి దశ తిరిగింది. అతడి తొలుతటి స్థితీ, ఇప్పటిస్థితీ ఎవ రెరగంది? అక్కడున్న ప్రతివాడికీ అది తెలుసు. ఆ టేనీటిదుకాణ వ్యవస్థాపకుడే, ఈ సీరపాణి—అనికూడా సవిస్తరంగా తెలుసు. పదేళ్ల క్రితం తినడానికి పట్టెడన్నం లేక

కొలి బోగైన మనిషి మంచి నాజూకయిన మేడలు కట్టించుకున్నాడు. వేలూ, లక్షలూ ఆర్జించుకున్నాడు. ఫోర్డుకారులోనే తప్ప ఇల్లు విడిచి ఎక్కడికీ వెళ్లడు. అతని మాటంటే పెద్ద పెద్ద అధికారులికి సైతం జవదాట శక్యం కానిది.

ఇంత గొప్ప మనిషీ ఏట్లా అయాడు ?

—వర్తకం! వర్తకం! వర్తకంలోంచి వాణిజ్యంలో కురికాడు. ధనరాసులు సంపాదించుకున్నాడు. మెచ్చుకోదగ్గ దేమంటే మానవజీవితానికత్యవసరమైన స్వేచ్ఛాసుఖాలు రెండూ అతని కుపలబ్ధాలు.

శివరామశర్మ పరుగునా పోయి, భార్యవద్ద నిల్చున్నాడు. ఆమెచేత, పెళ్లికాలంలో తల్లిదండ్రులు పెట్టిన గాజుల జత ఒక్కటే వుంది. అదిమ్మని ప్రాధేయపడ్డాడు. ఇస్తే వ్యాపారం చేస్తానన్నాడు. ఐశ్వర్యంలో సీరపాణిని మించిపోతానన్నాడు. ఆపై చూడమన్నాడు: ఎన్ని మేడలో, మిద్దెలో,......కార్లో...గిర్లో......

ఎండ నీవంక తేరిచూడదు!' అని తాను కట్టుకున్న స్వాప్నికజగత్తు నామెకీ చూపించి, గాజుల జత నెల్లాగో సంధించుకున్నాడు.

క్షణంలో అతని కళేబరం సీరపాణి బంగారు వెండి నగలదుకాణంలో దూరి కూచుంది. జతకు రెండువందల ఖరీదు వచ్చింది.

దీంతో ఏ వర్తకం చేస్తే లాభసాటిగా వుంటుంది? ఏది రాబడికొల్వ !

లాభనష్టాల సంగతి వర్తకులికే బాగా అవగతం. ఆ శాఖలో వారే నిపుణులు. ఇంకోహరైతే కిమన్నాస్తి—ఏమి తెలియక గోతిలో కాళ్లు దూర్చుకుంటారు. చేసేపని ఏదన్నా జాగ్రత్త ప్రాణం గనక వర్తకుల్తో సంభాషించినమీదటే వ్యాపారనిర్ణయం చేద్దామని భావించి, ఒకరిద్దరు వర్తకుల్ని వారి వారి వ్యవహారాల ఆర్థిక పరిస్థితినిగూర్చిన భోగట్టా తెలియజేయమని అడిగాడు.

అందరూ తాము చేస్తున్న వ్యాపారం ఒట్టి దండగే అని శర్మకి నచ్చజెప్ప జూచారు. కొనుబడి ధరలు లావనీ, అమ్మడు వెల స్వల్పమనీ యథార్థానికి అందులో తేడా అన్నదే అసలు నాస్తి అనీ, ఖర్చులే జాస్తి అనీ, ఎల్లాగూ తల దూర్చాము గనక లాభమో నష్టమో వ్యాపారాన్ని విడవకుండా పేరుకిమాత్రం సాగిస్తున్నామనీ చెబుతూ కళ్లమ్మట నీళ్ళు బొట బొటా కార్చారు.

వారి మాటలు శర్మ విశ్వసించలేదు. వ్యాపారానికి గోప్యం వుండవలసిన లక్షణం. వర్తకులెన్నడూ నిజాన్ని చెప్పరు. నష్టం వస్తోందని వారంటున్నారంటే లాభం అని దానికి అర్థం చెప్పుకోవాలి. లాభంలేని వ్యాపారం ఏ వర్తకుడు చేస్తాడు? ఎవ డంత నష్టానికి ధనాన్ని ధారబోసే అతీత వ్యక్తిత్వంగల మనిషి !

ససేమిరా ఏది ఏమైనా వ్యాపారం చెయ్యడానికే నిశ్చయించుకున్నాడు శర్మ. నడి బజార్లో గది అద్దెకి తీసుకుంటాడు. బీర్వాలూ, బల్లలూ, కుర్చీల్తో గదంతా నింపిపారేస్తాడు. వీధులన్నిటా అఖండంగా ప్రచురణ చేయిస్తాడు. అదనంగా కొంత ధనం కావలసివచ్చినా జంకడు. స్వగ్రామంలోని పెంకుటిల్లు వెచ్చించడానికయినా సరే సిద్ధం.

తెలివితేటలు ఈసరికే బూజుపట్టి పాడయిపోయాయ్. ఇప్పుడయినా సమయం మించిపోలేదు. వాటి నన్నిటినీ కేంద్రీకరించి, తానెంత వ్యవహారదక్షుడో, ఎంత అదృష్టవంతుడో లోకానికి తెలియజెయ్యా లనుకున్నాడు.

'మాస్కో !—మరి ఆరు నెలల్లో నీ జాతకాన్నే వ్యత్యస్తం చేసి పారేస్తాను. నీ ఇష్టమైన ఫక్కీలో రాయిస్తాను నీ జాతకచక్రం......నువ్వు గొప్పవాడి పుత్రుడివై పుట్టావురా అబ్బాయీ!... చచ్చుపెద్దమ్మ కొడుకువై పుట్టానని చింతించకు!—చింతించకు!" అనదలుచుకున్నాడు.

తాను నిజంగా చచ్చు పెద్దమ్మకొడు. చచ్చుపీనుగ్గా చేసింది నౌకరీ. కడుపు కాల్చి, గాడిదని చేసి పారేసింది. పరువుతీసి బయటపెట్టింది. దానికి రేపటితో స్వస్తి. రాజీనామా వుత్తరం రాసి జేబులోనే వుంచుకున్నాడు. అందులో అతినిశితమైన పదజాలాన్ని వాడి నౌకరీని తిట్టిపోశాడు. మర్నాటి వుదయం అందిస్తాడు యజమానికి! 'నమస్తే! నీ వుద్యోగం నీ జేబులోనే వుంచుకో!' అంటాడు. ఎన్నడూ లేనంత దర్జాగా, టెక్కుగా యజమాని

కళ్లెదటే సిగిరెట్టు ముట్టించి కాల్చుకుంటూ తిరిగి వస్తాడు. అవును. అతని భయం ఇంకా దేనికి? తనకీ అతనికీ మరేం సమ్బంధం? అత నెంత స్వతంత్రుడో తా నంత స్వతంత్రుడు. అతడు తన నెంత ఖాతిరీ చెయ్యడో, అతణ్ణి తానంత ఖాతిరీ చెయ్యడు. ఎవరి గొప్పవారిది. ఒకరొకరికి వంగి, వంగి, సలాములు చెయ్యాల్సిన పని లేదు ఏ ఒకరికీ. ఎవర్ని చూసి ఎవరూ భయపడనక్కర్లా. ఎవరికితగ్గ వ్యక్తిత్వం వారికుంది.

నడిబజార్లో జనార్దనం ఎదురై 'ఏవిటిరా శర్మా!—వ్యవహారం? ఇక్కడ తిరుగుతున్నా వెందుకు?' అని అడిగాడు.

శర్మ విస్తుపోయాడు. తాను వ్యవహారం చెయ్య దల్చుకున్నట్టూ జనార్దనం కెలా తెలిసిందో!

'అవును తమ్ముడూ! వ్యవహారం చేద్దామనే అభిలాష కలిగింది. ఏంచేద్దామా అనే ఆలోచిస్తున్నా. నువ్వు చెప్పు!-ఏంచేస్తే బాగుంటుందో!' అన్నాడు జనార్దనంతో—

'నీ కెందుకురా అబ్బీ వ్యవహారం? వుద్యోగం చేస్తూనే వున్నావుగా! హాయిగా, ఖులాసాగా జీవించక, ఈ రొంపిలో దిగడానికి బుద్ధిపుట్టిందేం' అన్నాడు.

'నీకు సుఖంగా కనిపిస్తోందేమో గాని, యమ యాతన పడిపోతున్నాను తమ్ముడూ!—ధనం చాలకా, స్వేచ్ఛ లేకా వచ్చిన జీతపు రాళ్లన్నీ హెచ్చుధరలకే వెచ్చపెడుతున్నాను. ఎన్నాళ్లని ఈ ప్రయాస? దీనికి తుదీ మొదలన్నది లేనే లేదా? అంతు కనుక్కోవాలని నిశ్చయించుకున్నాను. ఆర్జించిన విజ్ఞానం యావత్తూ ధారబోసి, వర్తకం చేసి ఐశ్వర్యం సంపాదించదలుచుకున్నాను. ఆర్థిక స్వాతంత్ర్యం లేని మనిషి మనిషి కాడు. నాకా స్వాతంత్ర్యం గమ్యం. నేను త్వరగా దొర్లిపోతాను గమ్యం వంకకి. ఎల్లా జీవితం సఫలం కాదో చూసి తీర్తాను!!'

'నువ్వు చూసి తీరేది నీ జీవిత సాఫల్యం కాదు తమ్ముడూ! ఎందరివో జీవితాల వినాశనం!' అన్నాడు జనార్దనం.

'ఇతర్ల జీవితాలకీ నాకూ లంకె ఏవిటి?—నే బాగుపడితే తక్కినవారికేం కొదవ?' అన్నాడు శర్మ.

'తక్కినవారు చెడితేనే నువ్వు బాగుపడటం. నీ లాభాలు ఒరుల నష్టాలు. వారి ఆక్రందనే నీ ఆర్జన! ఇందాక హెచ్చు ధరల గూర్చి, ప్రస్తావించి గోలపెట్టావు చూశావూ! అల్లాగే నిన్నుగూర్చి అందరూ గోలపెడతారు. నిన్ను బ్రహ్మరాక్షసుడ వంటారు. పీడించుకు తింటున్నా వంటారు. కడుపు మిక్కిలి మండితే, నీ భాండాగారం యావత్తూ అర్ధరాత్రి లూటీచేసి పారేస్తారు. ఒకవేళ హత్యకూడా చెయ్యబడవచ్చు—నువ్వు! వీటన్నిటికన్నా ప్రస్తుతం నువ్వు చేస్తున్న నౌకరీయే వుత్తమం. ఎవ్వరూ నిన్ను చూసి దుఃఖించరు. ఇతర్లు నిన్ను చూసి దుఃఖించనంతకాలం నువ్వెంత దుఃఖించినా ఫరవా నహి'

గిర్రున తిరిగాడు శివరామశర్మ. గబగబా సీరపాణి వెండిబంగారుదుకాణం చేరుకుని జేబులోని నోట్లకట్టను విసిరేసి, గంటక్రింద చెలామణీచేసిన గాజుల జత వాపసు చెయ్యమన్నాడు.

'క్షమించండి బాబుగారూ! బంగారు ధర పెరిగిపోయింది. మరి పదిరూపాయి లిప్పించండి. వాపసుచేస్తా మీ జత!' బదులు చెప్పాడు బేహారి.

'ఇప్పటి కిప్పుడే ఇంత మోసమా!!' స్తంభించిపోయాడు శర్మ.

